# నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, ఆదివారం 27 ఏప్రిల్ 2025 SIDDIPET









హైదరాబాద్‌లో గులాబీ రంగు అంబాసిడర్ కార్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## బండెనక బండి కట్టి..

- ఎల్కతుర్తికి బయలుదేరిన గులాబీ రంగు అంబాసిడర్ కార్లు
- జెండా ఊపి కార్లను ప్రారంభించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



ప్రత్యేక ఆకర్షణగా తరలుతున్న గులాబీ రంగు అంబాసిడర్ కార్లు

రామచంద్రాపురం, ఏప్రిల్ 26: బండెనక బండికట్టి 16 బండ్లు కట్టి అనే పాట అందరికీ తెలిసిందే. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా వరంగల్ ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించబోతున్న భారీ బహిరంగ సభకు తరలివెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలోనే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు సాయిచరణ్‌గౌడ్ వినూత్నంగా ఆలోచించారు. బీఆర్ఎస్ గుర్తు అంబాసిడర్ కార్లను తెప్పించి వాటికి బీఆర్ఎస్ స్టిక్కర్స్‌తో గులాబీ రంగుగా మార్చేశారు. వరంగల్ సభ కోసం 18అంబాసిడర్ కార్లను తెచ్చి వాటిని ఆకర్షణీయంగా తయారు చేయించారు. ఈ కార్లను శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నుంచే ఆ కార్లు వరంగల్ జిల్లా ఎల్కతుర్తికి బయలుదేరాయి. బీఆర్ఎస్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బహిరంగ సభ కోసం వినూత్నంగా ఆలోచించి పార్టీ గుర్తయిన అంబాసిడర్ కార్లను ఆకర్షణీయంగా ముస్తాబు చేయించినందుకు బీఆర్ఎస్ యువ నాయకుడు సాయిచరణ్‌గౌడ్‌ని హరీశ్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. హరీశ్‌రావు ఈ కార్లను ప్రారంభించిన అనంతరం బండెనక బండి కట్టి..18బండ్లు కట్టి అన్నట్లు ఒకే లైన్‌లో అంబాసిడర్ కార్లు వెళ్తుంటే రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంబాసిడర్ కార్ల వీడియోలు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. కార్యక్రమంలో పటాన్‌చెరు ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, నాయకులు సోమిరెడ్డి, రాములుగౌడ్, అంజయ్య, బాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, పృథ్వీ, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



మాడ్చెట్‌పల్లిలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ రమ్య అశోక్, నాయకులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 26: పెద్దశంకరంపేట మండలం మాడ్చెట్‌పల్లిలో మాజీ సర్పంచ్ రమ్య అశోక్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శనివారం సాయంత్రం ఉప సర్పంచ్ శ్రీశైలం, దావిద్, అశోక్, మాజీ ఎంపీటీసీ పాపమ్మ, వార్డు సభ్యులు మాణయ్య, అశోక్, డేవిడ్, రాములు, 250 మంది ఆయా పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు సురేశ్‌గౌడ్, రమేశ్, మాణిక్‌రెడ్డి, సుభాష్, దత్తు, యాకూబ్, యాదూల్, అంజయ్య, ఉప్పరి సాయిలు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి




కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జహంగీర్, అంజిరెడ్డి

- బీఆర్ఎస్ నాయకులు జహంగీర్, బట్టు అంజిరెడ్డి

ములుగు, ఏప్రిల్ 26 : తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని శ్రీరాంపూర్‌కు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొమ్ము నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి మాట్లాడుతూ... మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నర్సంపల్లి అర్జున్‌గౌడ్, పెద్దబాల్ అంజన్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేశ్‌గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, నాయకులు బొల్లెపల్లి బాలకృష్ణ, రవీందర్‌చారి, సుదర్శన్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదరణ చూసి ఓర్వలేక కుట్రలు



పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలిగిస్తున్న జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది



పటాన్‌చెరులో మాట్లాడుతున్న వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి

- కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే ఫ్లెక్సీలు చించివేసిన జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది
- పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి ఆరోపణలు

పటాన్‌చెరు, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండడంతో ఓర్వలేక అధికార కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది 'చలో వరంగల్' ఫ్లెక్సీలు తొలిగించారని పటాన్‌చెరు బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి ఆరోపించారు. పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ సర్కిల్‌లో సమీపంలో ఏర్పాటు చేసిన 'చలో వరంగల్' ఫ్లెక్సీలను శనివారం అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది తొలిగించారని ఆయన ఆరోపించారు. వరంగల్ సభకు ప్రజలు స్వచ్ఛందగా వచ్చేందుకు ముందుకు వస్తుండడంతో కాంగ్రెస్ నాయకులు చేసి ఓర్వలేక దాడులు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గులాబీ నేతలు ప్రశ్నించినా, నిరసన తెలిపినా, ప్రజల తరపున నిలబడినా కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కారంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలపై ప్రశ్నించినందుకు కేసులు నమోదు చేస్తున్నదని ఆయన విమర్శించారు. పటాన్‌చెరులో రాత్రి ఒంటి గంటకు ఫ్లెక్సీలు చించి తొలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు వరంగల్ సభకు వెళ్లకుండా భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగ్గిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేసేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. సమావేశంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, యువ నాయకులు చిన్నా, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

# చలో ఎల్కతుర్తి

## నేడు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలనున్న గులాబీదండు



సిద్దిపేట రంగధాంపల్లి అమరవీరుల స్తూపాన్ని గులాబీ తోరణాలతో ముస్తాబు చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

- దారులన్నీ ఎల్కతుర్తికే
- ఉమ్మడి జిల్లా నుంచి తరలనున్న రెండు లక్షల మంది
- నేతలకు దిశానిర్దేశం చేసిన హరీశ్‌రావు
- బస్సులు, ఇతర వాహనాలు సిద్ధం
- గులాబీమయంగా మారిన సిద్దిపేట-హన్మకొండ రహదారి
- భారీ కటౌట్లు, గులాబీ తోరణాలు, వాల్ పోస్టర్లతో విస్తృత ప్రచారం
- నేడు హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ




సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగు

సిద్దిపేట, ఏప్రిల్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి): పోదాం పదా ఎల్కతుర్తి రజతోత్సవ సభకు... అంటూ జనం జనజాతరకు సిద్ధమయ్యారు. కేసీఆర్ సార్‌ను చూసి, ఆయన మాటలు విని రావాలని ఊరూవాడ నుంచి ప్రజలు రజతోత్సవ సభకు కదులుతున్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మార్గదర్శనం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యులు వాహనాలను సమకూర్చారు. రజతోత్సవ సభకు వివిధ రూపాల్లో వెళ్లనున్నారు. కొంత మంది రైతులు ట్రాక్టర్ల ద్వార సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సిద్దిపేట నుంచి రెండు వేల మంది యువత పాదయాత్రగా ముల్కనూరు వరకు చేరుకున్నారు. వీరు సభా ప్రాంగణానికి ఆదివారం సాయంత్రం చేరుకుంటారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి రజతోత్సవ సభకు సుమారుగా రెండు లక్షల మంది జనం తరలివెళ్లనున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు తమ తొవ్వ ఖర్చులకు కూలి పనిచేసి వచ్చిన డబ్బులతో వాహనాల ఖర్చులకు సమకూర్చున్నారు. బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో మహిళా నేతలు కూలీ పని చేసి తొవ్వ ఖర్చులు సిద్ధం చేసుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇలా తొవ్వ ఖర్చులకు సిద్ధం చేసుకున్నారు. ఉద్యమాల పురిటి గడ్డ ఉమ్మడి మెదక్ జిల్లా ఆది నుంచి బీఆర్ఎస్‌కు అండగా నిలిచింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ ప్రాంత బిడ్డ కావడంతో అన్ని సందర్భాల్లో ప్రజలంతా ఆయనకు అండగా నిలిచారు. బీఆర్ఎస్ స్థాపించి 25ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించే పార్టీ రజతోత్సవ సభకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల నుండి రెండు లక్షలకు పైగా జనం తరలివెళ్లనున్నారు.

**గులాబీమయంగా సిద్దిపేట-హన్మకొండ రహదారి...**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నేడు జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకొని భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు.గులాబీ తోరణాలు కట్టారు. ఎక్కడ చూసినా గులాబీ జెండాలతో రహదారి కనిపిస్తున్నది. పల్లెపల్లెనా వాల్ రైటింగ్ వేశారు. సభ ప్రచార పోస్టర్లను గోడలపై అతికించారు. చలో వరంగల్ అంటూ పెద్ద ఎత్తున వాల్ రైటింగ్‌ను స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ ముఖ్య నాయకుల పేర్ల మీద రాయించారు. సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేశారు. మండలాలు, గ్రామాల వారీగా పార్టీ నాయకులు సమావేశాలు నిర్వహించుకున్నారు. సభకు వెళ్లేందుకు వాహనాలు, భోజనం, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లు చేసుకున్నారు.

**పార్కింగ్ జోన్ -5**

సిద్దిపేట, హుస్నాబాద్, ముల్కనూరు, గోపులాపూర్ క్రాస్‌రోడ్డు మీదుగా ఇందిరానగర్ వద్ద పార్కింగ్ జోన్-5 వద్ద జిల్లా నుంచి వెళ్లిన వాహనాలను పార్కింగ్ చేస్తారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, అదిలాబాద్, ఖానాపూర్, బోథ్, ముథోల్ నియోజకవర్గాల నుంచి ఈ రూట్‌లో జనం తరలివెళ్లనున్నారు.

### నేడు పార్టీ జెండా ఆవిష్కరణలు

నేడు అన్ని గ్రామాల్లో, వార్డులో గులాబీ జెండాలను ఆవిష్కరించనున్నారు. పార్టీ జెండా గద్దెలకు రంగులు వేయడంతో పాటు పార్టీ అధినేత కేసీఆర్ బొమ్మలను వేశారు. పార్టీ జెండాలను సిద్ధం చేశారు. ఆయా గ్రామాల్లో గులాబీ శ్రేణులు పార్టీ జెండాలను ఉదయమే ఆవిష్కరించి దూరం భారం అనుసరించి సభకు బయలుదేరుతారు. కొన్ని ప్రాంతాల నుంచి ఉదయమే ప్రయాణం కానుండగా, మరి కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి వాహనాల్లో తరలివెళ్లనున్నారు.

## పాదయాత్రకు హరీశ్‌రావు సంఘీభావం

బెజ్జంకి, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తిలో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో యూత్ సభ్యులు పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్నారు. వీరికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శనివారం సంఘీభావం తెలిపి అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్తా, రాజు, తిరుపతి, బాలనర్సు, సుదర్శన్, దీలిప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న యూత్ సభ్యులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## బస్వాపూర్ చేరుకున్న పాదయాత్ర

- పూలుచల్లి స్వాగతించిన నాయకులు
- సముద్రాలలో విశ్రాంతి తీసుకున్న యువకులు
- యువకులను కలిసి మాట్లాడిన హరీశ్‌రావు

కోహెడ, ఏప్రిల్ 26: ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిద్దిపేట నుంచి పాదయాత్రగా బయలుదేరిన యువత, బీఆర్ఎస్ శ్రేణులు శనివారం మండలంలోని బస్వాపూర్‌కు చేరుకున్నారు. మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేశ్ దంపతులు, స్థానిక నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. జేసీబీలతో యువకులపై పూలవర్షం కురిపించారు. జై కేసీఆర్, జైబీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పాదయాత్ర మండలంలోని సముద్రాలకు చేరుకోగా, అక్కడ విశ్రాంతి తీసుకున్నారు. హుస్నాబాద్‌కు బయలుదేరుతుండగా ఎమ్మెల్యే హరీశ్‌రావు పాదయాత్ర చేస్తున్నవారిని కలిసి మాట్లాడారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు హరీశ్‌రావును స్వాగతం పలికి సన్మానించారు. హరీశ్‌రావు రావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. పార్టీ నినాదాలు చేస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పెరుగు నరేందర్‌రెడ్డి, తిప్పారపు నాగరాజు, గవ్వ వంశీధర్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.



బస్వాపూర్ చేరుకున్న యువకులు

## రెండోరోజూ కొనసాగిన పాదయాత్ర

నంగునూరు, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు సిద్దిపేట నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ విద్యార్థి యువజనుల పాదయాత్ర రెండోరోజు నంగునూరు మండలం బద్దిపడగ వద్ద ప్రారంభమైంది. శనివారం బద్దిపడగ నుంచి బయలుదేరిన పాదయాత్ర కోహెడ మండలం సముద్రాల వరకు చేరుకుంది. పాదయాత్రకు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నంగునూరు నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, లింగంగౌడ్ తదితరులు సంఘీభావం తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు.



విద్యార్థి యువజనులతో కలిసి పాదయాత్ర చేస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లో పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, యువకులు

## హుస్నాబాద్‌కు చేరిన బీఆర్ఎస్ పాదయాత్ర

- స్వాగతం పలికిన నాయకులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిద్దిపేట నుంచి బయలుదేరిన పాదయాత్రకు శనివారం సాయంత్రం హుస్నాబాద్ అనభేరి విగ్రహం వద్ద హుస్నాబాద్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న, నేషనల్ లేబర్ కోఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఎడబోయిన తిరుపతిరెడ్డి, లింగాల సాయన్న, మాజీ జడ్పీటీసీలు మాలోతు బీలునాయక్, బూక్యా మంగ, మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మి, ఆకుల వెంకట్‌తో పాటు పలువురు నాయకులు పాదయాత్ర చేస్తున్న యువతకు బొట్టుపెట్టి మంగళ హారతులతో స్వాగతం పలికారు. జేసీబీలతో పాదయాత్రపై పూలవర్షం కురిపించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా మల్లెచెట్టు చౌరస్తా మీదుగా అక్కన్నపేట చౌరస్తాకు చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు జై తెలంగాణ అంటూ స్వాగతం పలకడంతో పాటు ర్యాలీని తమ ఫోన్‌లో బంధించారు. అక్కన్నపేట చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి జై తెలంగాణ అంటూ నినదించారు. పాదయాత్ర చేస్తున్న యువత, నాయకులు, కార్యకర్తలకు హుస్నాబాద్‌లోని అనభేరి విగ్రహం వద్ద అరటిపండ్లు, మజ్జిగ ప్యాకెట్లు, నీటిబాటిల్స్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనిత, నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, బండి రమణారెడ్డి, మ్యాక నారాయణ, కన్నోజు రామకృష్ణ, కొడముంజ రవీందర్, మాజీ కౌన్సిలర్లు గూళ్ల రాజు, వాల సుప్రజ, బోజు రమాదేవి, గోవిందు రవి, నాయకులు కొంకట రవీందర్,ఎండీ అయూబ్, అయిలేని శంకర్‌రెడ్డి, సదానందం, గోనెల మధుకర్, కూతాటి విజయభాస్కర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో పాదయాత్ర చేస్తున్నవారికి స్వాగతం పలుకుతున్న దండుగుల రాజ్యలక్ష్మి తదితరులు

## హైడ్రా.. ఇదేం తీరు..!

### ప్రభుత్వ భవనానికి ఎఫ్‌టీఎల్ నిబంధనలు వర్తించవా?

- రహదారి పక్కనే ఎఫ్‌టీఎల్ స్థలంలో పీహెచ్‌సీ నిర్మాణం
- అదే భవనం చుట్టూ ఉన్న నిర్మాణాలకు గతంలో నోటీసులు
- గతంలో ఆ నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

అమీన్‌పూర్, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చెరువులు, కుంటలను కాపాడాలని ప్రత్యేకంగా హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ బఫర్ స్థలాల్లో ఉన్నాయంటూ చాలా చోట్ల ప్రజల నిర్మాణాలను కూల్చివేశారు. అమీన్‌పూర్ ప్రాంతంలో అనేక చోట్ల భారీ భవనాలను సైతం కూల్చివేశారు. కానీ, ఎఫ్‌టీఎల్ స్థలాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నా హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ప్రైవేట్ ఆస్తులను మాత్రమే ధ్వంసం చేస్తున్నది. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ శంభునికుంట పరిసరాల్లోని ఎఫ్‌టీఎల్ స్థలాల్లో అనేక అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఇరిగేషన్ అధికారులతో పాటు హైడ్రా కమిషనర్‌కు చాలా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా రెండుసార్లు వచ్చి పరిశీలించారు. ఆ తర్వాత పటాన్‌చెరు ఇరిగేషన్ అధికారులు అక్కడ నూతన నిర్మాణాలతో పాటు పాత భవనాలకు సైతం నోటీసులు ఇచ్చారు. ఇంతవరకు హైడ్రా పనితీరు, ఇరిగేషన్ అధికారుల ఉత్సాహంతో కుంటను పరిరక్షించేందుకు చేసిన ప్రయత్నాన్ని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ, అనతికాలంలోనే అదే శంభుని కుంట ఎఫ్‌టీఎల్ స్థలంలో గతంలో అటుపక్క, ఇటుపక్క భవనాలకు నోటీసులు అందచేసిన ప్రాంతంలోనే ప్రభుత్వ పీహెచ్‌సీ నిర్మిస్తున్నారు. దీనిని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రూ.35 లక్షలతో ప్రభుత్వ నిధులతో పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపడుతుండడంతో ఇదేమి తీరు అని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న భవనాలను కూల్చివేసే పరిస్థితులు వస్తే ప్రభుత్వ భవనం కూల్చాలా..లేదా పక్కనే ఉన్నా భవనాలను కాపాడాలా.. అనే ప్రశ్నలు వెలువెత్తున్నాయి. ఏదిఏమైనా ఎఫ్‌టీఎల్‌లో ప్రభుత్వ భవనం నిర్మించడాన్ని బట్టి చూస్తుంటే అధికారులు సైతం మిన్నకుండిపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని స్థానికులు వాపోతున్నారు.

**జీవో 58,59 దరఖాస్తుల తిరస్కరణ...**

గతంలో ఇదే ప్రాంతంలో కొందరు పేదలు కట్టుకున్న తమ ఇండ్లకు అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 58, 59 జీవో ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అయిప్పటికీ ఆ దరఖాస్తులను పరిశీలించి మీ ఇండ్ల స్థలాలు శంభునికుంట ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. కానీ, ప్రస్తుతం అదే స్థలంలో ప్రభుత్వ భవనం నిర్మిస్తుండడంతో తమ దరఖాస్తులను తిరిగి పరిశీలించి రెగ్యులర్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శంభునికుంట ఎఫ్‌టీఎల్‌లో నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనం